ఏర్పాటుచేశాడు. రాముడు పశువుల వ్యాపారిగా క్షణం తీరికలేదు. కటారి పాదరక్షల తయారీదారు మాత్రమే కాదు.. ఇప్పుడు కొత్తకొత్త పరికరాల రూపకల్పన, తయారీ సంస్థను స్థాపించాడు. కాంతయ తోలుతో కొత్త వస్తువుల తయారీలో ప్రఖ్యాతి పొందాడు. అంతే కాదు.. వెలనాడు అనుభవాలతో ఆయా రంగాలపై పూర్తి అవగాహన కలిగిన జాయపచోడుడు.. ఆయా సామాజిక, ఆర్థిక, వ్యాపార రంగాలను కూడా సంస్కరించాడు. చలమయకు ఆర్థిక సహాయం చేస్తానన్న అహోబలపతి చిరునామా.. ఇన్నేళ్లయినా దొరకలేదు. జాయచోడుడు పెట్టుబడిదారులైన శ్రేణి వైశ్యుల ద్వారా ఆర్థిక సహకారం అందించాడు.

''నేనూ ధనసహాయం చేశాను. కానీ, అహోబలపతి కోసం చలమయ పిచ్చివాడిలా తిరుగుతున్నాడు.. ప్చ్! ఆ బాధ పగవాడికి కూడా వద్దు మిత్రమా'' అన్నాడు త్రిపుర శెట్టి.

మిత్రులంతా ఎన్నిసార్లు కాకతి గురించి అడిగినా..

''ఏమో..'' అనే సమాధానమే!

''మరి పెళ్లి చేసుకోవచ్చు కదా యువరాజా!''.

''వివాహం అయిపోయిందిగా మిత్రమా! మళ్లీమళ్లీ చేసుకునేది వివాహం కాదు. కామకేళీ విలాసం. అది నాకు మెండుగా దొరుకుతోంది. పాలు దొరుకుతున్నప్పుడు ఆవును కొనమని సలహా ఇవ్వడం భావ్యమా!?''.

ఇలాంటి చర్చతో వారిని విసిగించి నోరు మూసుకునేలా చేస్తాడు. లోలోన మాత్రం..

'కాకతీ.. నన్నేం చెయ్యమంటావు??' అనుకుంటాడు కళ్లు మూసుకుని.

ఆమె నవ్వో.. ఏడుపో.. వినిపిస్తుంది. మంద్రంగా.. ఎక్కడో.. అంతరంగ అగాధాలలో!

❖ ❖ ❖

గణపాంబ పెళ్లి కాదు గానీ, 'గణపతిదేవుని వారసుడు ఎవరు?' అనేది అనుమకొండలో ప్రధాన చర్చ అయ్యింది. ప్రజలు ఏదో అనుకుంటున్నారని అనుకున్నా.. జాయచోడుని కుతూహలం కూడా అదే! అక్క, బావగారు కూడా ఈ అంశంపై ఓ చెవి పెట్టి ఉన్నారని ఆయన భావన.

గణపతిదేవుని వారసులపై ప్రజలు ఎలా ఆలోచిస్తున్నారు అనేది ఇప్పుడొక ఆసక్తికర అంశం.

గణపాంబ వివాహం నుంచి గణపతిదేవుని వారసులపై ప్రజల దృష్టి పడింది. అది కూడా తీవ్రంగా!

మొదటగా రుద్రమదేవుడు నపుంసకుడట!!

ఇది వెలువడగానే కార్చిచ్చులా అతివేగంగా అనుమకొండ దాటి రాజ్యమంతటా వ్యాపిస్తోంది.

సాధారణంగా ప్రజలకు రాజనగరి నుంచి వీరోచిత గాథలు, చక్రవర్తి చేసిన మహోన్నత యుద్ధాలు, శత్రువులను దునుమాడిన కథలు కావాలి. పనిపాట్లవేళ వాటికి మరింత వీరత్వం కలిపి ఆటలు, పాటలు రూపొందించి పాడుకుంటారు.. చెప్పుకొంటారు. యువరాజుగారి కుర్ర వీర, బీభత్స, శృంగారరస ప్రధాన కథలైతే మరీ ఇష్టం. అలాంటి యువరాజువారు నపుంసకుడంటే.. అంతకంటే విషాదం మరిలేదు వాళ్లకు.

ఇదేదో రుద్రమదేవుని శారీరక రుగ్మత అనుకున్నాడు కానీ, దీనిపై ఇంత రాద్ధాంతం జరుగుతుందని ఆయన ఊహించలేదు. అయితే రుద్రమదేవుడు నపుంసకుడు కాబట్టి రెండవ కొడుకు మురారిదేవుడు కాకతీయ వారసుడు కావాలి అనే మరో నినాదం వెనువెంటనే పుట్టి.. అది కూడా కార్చిచ్చు అయ్యింది. అది ప్రజల్లో వ్యాపిస్తుండగా రాజప్రాసాదంలో మరోవార్త ఆయన చెవిన పడింది.

రుద్రమదేవుడు మగవాడు కాదు.. నపుంసకుడు అసలేకాదు. ఆడపిల్ల!

జాయచోడుడు విభ్రాంతి చెందాడు. బావగారిని అడిగాడు.


''సూటిగా అడుగుతున్నాను బావగారూ! రుద్రదేవుని జన్మరహస్యం ఏమిటో.. చెప్పండి!''.

కాసేపు ఆలోచించి మెల్లగా చెప్పాడు గణపతిదేవుడు.

''ఈ గందరగోళానికి కారణం మేమే! ఒకానొక తరుణంలో ఏ నిర్ణయం తీసుకోవాలో తెలియక మేము తీసుకున్న పిచ్చినిర్ణయం.. ఇవ్వాళ ఈ గందరగోళానికి కారణం. అందుకే చెప్తున్నా విను. రుద్రమదేవుడు నిజానికి రుద్రమ దేవి. పదహారణాల ఆడపిల్ల. మా ఖ్యాతి నిలబెట్టగల వీరయోధురాలు. ఈమె పుట్టిన సమయానికి నువ్వు రాజనగరిలో లేవు. నీకు తెలుసో లేదో.. అప్పుడు రాజ్యమంతటా గొప్ప అలజడి రేగింది. కారణం.. మాకు రెండోసారి ఆడపిల్ల పుడితే.. అంటే మా సంతానం ఇద్దరూ ఆడపిల్లలే అయితే, ఇద్దరికీ సింహాసనార్హత లేదు. అప్పుడు గణపతిదేవుడి వారసుడు ఎవరు? అనే చర్చ చాలా తీవ్రంగా జరిగి, అనుమకొండ అట్టుడికిపోయింది. ఆ సందర్భంగా మేము అత్యవసర సమావేశం నిర్వహించి పెద్దలందరి అభిప్రాయం తీసుకుని అప్పటికి.. 'అబ్బాయే పుట్టాడు' అని ప్రకటించడానికి అనుజ్ఞ ఇచ్చాము. నిజంగానే అప్పటికా సమస్య తొలగిపోయింది. ఎవరికీ సందేహం రాకుండా ఆమెను పసిప్రాయంలోనే త్రిపురాంతకం పంపేశాము. మేమిద్దరమే వెళ్లి చూసి వస్తుండేవాళ్లం. యుక్త వయస్కురాలైన ఆమె అక్కపెళ్లికి రావడంతో గందరగోళం ఏర్పడింది. కానీ, ఎంతకాదన్నా ఆడపిల్ల కదా! రహస్యం దాచడం కష్టమౌతోంది. వయసు వచ్చి పరిణీత అయిన యవ్వనవతిని మగపిల్లవాడిగా చూపడం చాలా కష్టం. ఆమె ఆనందాలు ఆమెకుంటాయి. మగవాడి వేషంతో ఇటు మగవాళ్లతో, అటు ఆడవాళ్లతో కలిసిమెలిసి తిరగలేక.. పాపం పిచ్చిపిల్ల సతమతమైపోతోంది. దీనికితోడు ప్రజల్లో ఈ పుకార్లు.. మాటలు! ప్రజలు వేగంగా స్పందిస్తారు. రుద్రమదేవుడి మీద నమ్మకం పోగానే రెండవవాడు మురారిదేవుడి మీదికి సహజంగా వాళ్ల దృష్టిపోయింది!'' దీర్ఘంగా నిట్టూర్చి..

''ఇక రహస్యం బట్టబయలు చెయ్యాల్సిన సమయం వచ్చేసింది. ప్రజలు ఎలా స్పందిస్తారో తెలియదు కానీ, ఈ రహస్యం వల్ల అనవసర రాద్ధాంతాలు జరుగుతున్నాయి. వాటికీ ముగింపు పలకాల్సింది మేమే కదా.. ఈ సమస్యను ముగిస్తాము!''.

మరునాడు ఉదయాన్నే ధార్మిక నియోగ అమాత్యుడు ధర్మనిధి లెంకను తన మనిషిగా శ్రీశైలం గోళకీ మఠానికి పంపి.. విశ్వేశ్వర శంభుదేశికులను రాజనగరుకు రప్పించి.. మొదటి కొలువు సమయమంతా కూలంకషంగా శాస్త్ర చర్చలు జరిపాడు. అనంతరం ఆ ప్రకటన భాగాన్ని ఆస్థాన రాజలేఖకుడు విశ్వకర్మాచారితో రాయించి.. దానిని జాయచోడునికి చూపి.. ఆయన 'సరే!' అన్నాక, ప్రజావార్తసంబంధి చతుష్పథాల వద్ద ప్రకటించింది.



''జయ.. జయజయజయ.. జయ
జయ.. శ్రీశ్రీశ్రీ గణపతిదేవులవారికి.. జయ
జయ.. కాకతీయ సామ్రాజ్యానికి.. జయ

పురవాసులకు, సమస్త కాకతీయ రాజ్య ప్రజలకు, సామంతరాజ్యాల ప్రజలకు శుభవార్త! ప్రకటిస్తున్నవారు అనుమకొండ నగర దండనాయకులు శ్రీ అంకయ చమూపతి.

గతంలో మన్మహామండలేశ్వరుల వారికి రెండవ సంతానం కలిగిన వేళావిశేషాలను బట్టి, పుట్టిన నక్షత్ర రాశులను బట్టి, ఆ ముహూర్తం నాటి రాహుకేతుగ్రహాల ప్రభావాన్నిబట్టి పుత్రుడు జన్మించినట్లుగా ప్రకటించడం జరిగింది. ఆ చెడుగ్రహాల ప్రభావం ఇప్పుడు తొలగిపోయినట్లుగా ఆస్థాన పురోహితులు, గురువులు, శైవ స్వరూపులు శ్రీశ్రీ విశ్వేశ్వర శంభుదేశికులు తెలియజేసిన దరిమిలా.. ఆ రెండవ సంతానం పుత్రిక అని తెలియజేయడమైనది. ఆ చిరంజీవి లక్ష్మీసౌభాగ్యవతి నామధేయం రుద్రమదేవి. కావున తెలియజేయడమైనది.

జయ.. కాకతీయ సామ్రాజ్యానికి.. జయ''..

చెప్పాలనుకున్నది చెప్పేశాడు గణపతిదేవుడు. ప్రజల భావనలు ఎలా ఉన్నాయో చెప్పాల్సింది శుక్ర. అతడు అందించబోయే ప్రజావాణి కోసం రాజమందిరంలో అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

''అబ్బాయి అయితే ఇద్దరు కొడుకులలో ఎవరు వారసుడు అనే సమస్య వస్తుంది కానీ, అబ్బాయి కాదు.. అమ్మాయి అంటే మాకేమిటి నష్టం! గణపాంబలాగే రుద్రాంబకు కూడా వివాహం చేస్తారు. మెట్టినింటికి వెళ్లిపోతుంది. ఇప్పుడు ఒక్కడే కొడుకు. అతడే కాకతీయ సింహాసన వారసుడు.. మురారిదేవుడు!''..

ఇది శుక్ర నివేదికలో ప్రధానాంశం..

❖ ❖ ❖

మరునాటి ప్రత్యూషవేళ కాలకృత్యాలు తీర్చుకుని కాసే బిగించి కట్టి వ్యాయామశాలకు వెళ్లాడు జాయపుడు. ఆశ్చర్యం!

అక్కడ గణపతిదేవుడు మరొకరితో కుస్తీపట్లు పోటాపోటీగా పడుతున్నాడు. ఆ వ్యక్తికున్న కేశాలంకరణ వల్ల మహిళ అని తెలుస్తోంది.

దగ్గరికి వెళితే అబ్బురంగా.. అతడు.. కాదు కాదు ఆమె! రుద్రమదేవి!!

''రా జాయా! రా రా.. సూర్యోదయాత్పూర్వమే వీరుడు నిద్రలేవాలి. మాబోటి మహామండలేశ్వరులు చూశావా! ప్రత్యూషవేళకు ముందే వ్యాయామశాలకు వస్తున్నారు. ఈరోజు తమరే ఆలస్యం. ఇదిగో ఈ అబ్బాయిని తేరపార చూడు. ఎవరో గుర్తించావా.. కాకతీయ కొదమసింహం.. మా ద్వితీయ కుమార్తె రుద్రమదేవి! నువ్వన్నట్లు ఇంతకాలం మగాడని చెప్పడం మా తప్పు. అదీ ఒకందుకు మంచిదే అయ్యింది. అన్ని యుద్ధవిద్యల్లోనూ ఆరితేరింది. ప్రస్తుత మన రాజ్యంలో, మన సామంతరాజ్యాలలో రుద్రమతో సరిరాగల మహిళలే కాదు.. సరిరాగల మగాడు కూడా లేడని తనే నిరూపించుకుంటుంది!''.

కూతురి యుద్ధవిద్యా ప్రావీణ్యం చూసి.. కూతురు గురించి కొండంత తృప్తితో చెప్పాడు గణపతిదేవుడు.

జాయచోడుడు విభ్రమంగా చూస్తున్నాడామెను.. కాకతీయ సామ్రాజ్య భవిష్యత్ స్వరూపాన్ని!! ■

(సశేషం)